JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । ఆదివారం 31-08-2025
Medchal - Malkajgiri । Sunday 31-08-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 96 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 96 । Pages : 8 । ₹: 5

ఇటీవల లక్నోలో జరిగిన ఒక పాట ప్రమోషన్ ఈవెంట్‌లో జరిగిన ఘటనతో మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. 'సైయా సేవా కరే' పాట ప్రచార కార్యక్రమం సందర్భంగా వేదికపై మాట్లాడుతున్న అంజలి దగ్గరకు హీరో పవన్ సింగ్ వచ్చాడు. ఆమె అనుమతి లేకుండా ఆమె నడుమును తాకాడు. చీరపై ట్యాగ్ ఉందని, దాన్ని తీసేందుకు అలా చేశానని పవన్ చెప్పినట్లు వీడియోలో వినిపించింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అంజలి రెండు రోజుల తర్వాత ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందిస్తూ తన మనోవేదనను బయటపెట్టారు. 'నన్నే తప్పు పట్టి మీమ్స్ చేస్తున్నారు. ఈ ఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అందుకే భోజ్‌పురి సినిమా ఇండస్ట్రీని పూర్తిగా వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు ఆమె స్పష్టంచేశారు.





# యూరియా కొరతపై ఆందోళన

## అసెంబ్లీ ముట్టడి.. అరెస్ట్.. ఉద్రిక్తత

రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కారణమని ఆరోపిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీర్. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఇలాంటి సమస్య వచ్చిందని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా, రైతుల సమస్యలు తప్ప అన్నింటిపై చర్చిస్తోందని ఆరోపించారు. అందుకే ఈ కాంగ్రెస్ పాలన వద్దురా అని ప్రజలు అంటున్నారని అభిప్రాయపడుతున్నారు. BRS నేతల యూరియా ఆందోళన కార్యక్రమం కపట నాటకమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమా? లేక కేంద్ర ప్రభుత్వమా కారణమేదో తెలియదా అని ప్రశ్నించారు.

**తెలంగాణలో యూరియా రాజకీయం మరింత రాజుకుంది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభమైన రోజునే అధికార ప్రతిపక్షాల మధ్య వాతావరణం హీటెక్కింది. తొలిరోజు అసెంబ్లీ సమావేశం ముగిసిన తర్వాత నేతలంతా వ్యవసాయ కమిషనర్ వద్దకు వెళ్లారు. అక్కడ కమిషనర్‌తో మాట్లాడారు. యూరియా కొరతతీర్చాలని వినతి పత్రం ఇచ్చారు. ఎప్పటి లోపు యూరియా కొరత తీరుస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.**

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 30 :**

ప్రభుత్వంతో మాట్లాడి స్పష్టమైన ప్రకటన చేయాలని అన్నారు. అప్పటి వరకు కమిషన్ కార్యాలయంలోనే ఉంటామి స్పష్టం చేశారు. కమిషనర్‌కు కాసేపు సమయం ఇచ్చారు. అయినా వారి నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో కార్యాలయం ఎదుటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలంతా బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేశారు. గణపతి బప్పా మోరియా... రైతులకు కావాలి యూరియా అంటూ నినదించారు.పోలీసులు రంగప్రవేశం చేసి హరీష్‌రావు, కేటీఆర్ సహా ఇతర నేతలతో చర్చించారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. పోలీసుల మాటలను గులాబీ నేతలు లెక్క చేయలేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదుల చేయడం ఆపలేదు. దీంతో వారిని అక్కడి నుంచి తరలించేందుకు పోలీసులు యత్నించారు. వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచి బీఆర్ఎస్ నేతలను బలవంతంగా తరలించేందుకు పోలీసుల చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారి తీసింది. అయినా సరే అతికష్టమ్మీద వారిని వాహనాల్లోకి ఎక్కించి తరలించారు. వ్యవసాయ కమిషన్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ నేతలను తరలిస్తున్న టైంలో సచివాలయం వద్దకు వచ్చేసరికి వారి వాహనం ఆగిపోయింది. వెంటనే హరీష్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు వాహనాలు దిగిపోయారు. పక్కనే ఉన్న సచివాలయ ముట్టడికి వెళ్లారు. ప్రధాన కార్యదర్శిని కలిసేందుకు యత్నించారు. సచివాలయం భద్రతా సిబ్బంది వారిని లోపలికి పంపించేందుకు నిరాకరించారు. మళ్లీ అక్కడకు వచ్చిన పోలీసులు వారిని తరలించేందుకు యత్నించారు. అక్కడ కూడా కాసేపు ఉద్రిక్తత నెలకొంది. మొత్తానికి అక్కడ కూడా అతి కష్టమ్మీద నేతలను మరోసారి అదుపులోకి తీసుకొని తెలంగాణ భవన్‌కు తరలించారు. ఇలా హైడ్రామా మధ్య బీఆర్ఎస్ నేతల యూరియా ధర్నా సాగింది. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కారణమని ఆరోపిస్తున్నారు బీఆర్ఎస్ నేతలు హరీష్‌రావు, కేటీర్. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఇలాంటి సమస్య వచ్చిందని అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా, రైతుల సమస్యలు తప్ప అన్నింటిపై చర్చిస్తోందని

...మిగతాది 2 లో

# జపాన్ తో భారత్ భారీ ఒప్పందాలు



**జయభేరి, న్యూఢిల్లీ, ఆగస్టు 30 :**

ఆర్థిక సహకారాన్ని పెంచే దృక్పథంతో ప్రధాని నరేంద్ర మోదీ జపాన్‌లో పర్యటించారు. ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటనలో జపాన్ ప్రధాని మోదీతో పాటే ఉండటం విశేషం. జపాన్‌కు వెళ్లిన ప్రధాన మంత్రి మోదీకి జపాన్ ప్రధాన మంత్రి ఇషిబా స్వాగతం పలికారు. తరువాత ప్రతినిధి బృందం స్థాయి చర్చలు, విందులో పాల్గొన్నారు. మరుసటి రోజు నాయకులు టోక్యో నుండి సెండాయ్‌కు షింకన్‌సెన్ బుల్లెట్ రైలులో కలిసి ప్రయాణించి, కలిసి భోజనం చేశారు. టోక్యో ఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. జపాన్ ప్రధాని 2 రోజుల పాటు ప్రధాని మోడీతోనే ఉన్నారు. మరి ఈ పర్యటనలో భాగంగా జరిగిన కీలక ఒప్పందాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం..రాబోయే పదేళ్లలో భారత్‌లోకి JPY 10 ట్రిలియన్ల ప్రైవేట్ పెట్టుబడులకు జపాన్ కట్టుబడి ఉండటం అత్యంత ముఖ్యమైన ప్రకటనలలో ఒకటి. ఈ పర్యటన భారత్‌జపాన్ సంబంధాల తదుపరి దశాబ్దాన్ని రూపొందించే మైలురాయి ఫలితాలకు మార్గం సుగమం

...మిగతాది 2 లో

# కబ్జాకు గురవుతున్న కార్పొరేషన్ భూములు




*రంగారెడ్డి జిల్లా బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పార్కు స్థలాలన్నీ కబ్జాకు గురవుతున్నాయి. ఇక్కడ విచిత్రమేమిటంటే తాటికాయ అంత అక్షరాలతో గతంలో బోర్డులు పాతిన చోటనే అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఆ స్థలాల్లో నిర్మాణాలకు యథేచ్ఛగా అధికారులు అనుమతులు జారీచేయడం కోసమెరుపు. ఇలా రూ.300 కోట్ల విలువైన భూములు కబ్జాకు గురైనట్లు అంచనా. ఏ పార్టీ అధికారం ఉంటే ఆ జెండా కింద పనిచేస్తున్న తాజా, మాజీ నేతలే అసలు పాత్రధారులు, సూత్రధారులని స్థానికులు చెబుతున్నారు.*

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 30:**

రంగారెడ్డి జిల్లాలోని బడంగ పేట్ కార్పొరేషన్ ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో ఒకటి. ఆదాయంలో రాష్ట్రంలోనే రెండో కార్పొరేషన్ గా ప్రస్తుతం పేరుగాంచింది. కార్పొరేషన్ కు ఇరువైపులా ఆదిభట్ల, తుర్కయంజాల్, జల్ పల్లి, తుక్కు గూడ మున్సిపాలిటీలు, మీర్ పేట్ కార్పొరేషన్ తో పాటు హస్తినాపురం, బీఎన్ రెడ్డి, వనస్థలిపురం, రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ డివిజన్లు ఉన్నాయి.గతంలో సరూర్ నగర్ మండలంలో తొమ్మిది పంచాయతీలు నాదర్ గుల్, కుర్మలాగూడ, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, మామిడిపల్లి, బాలాపూర్, మల్లాపూర్, వెంకటాపూర్, సుల్తాన్ పూర్, బాలాపూర్ అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం బాలాపూర్ మండలం పరిధిలో కార్పొరేషన్ ఉంది. సమీపంలోనే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ప్రభుత్వం ఎంతో

...మిగతాది 2 లో




# కుప్పానికి కృష్ణా జలహారతి

## చెప్పిన మాట చేసి చూపించామని చంద్రబాబు సంతోషం

**జయభేరి, తిరుపతి, ఆగస్టు 30:**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు వద్ద కృష్ణా నది జలాలకు జలహారతి అర్పించారు. హంద్రీనీవా కాలువ విస్తరణ ప్రాజెక్టు ద్వారా రాయలసీమ జిల్లాలకు చిత్తూరు, కుప్పం, పలమనేరు మొదలైన ప్రాంతాలు కృష్ణా నది నీరు చేరుకోవడానికి చేపట్టిన భారీ ప్రాజెక్ట్. ఈ ప్రాజెక్టు ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు ప్రసంగించారు. వైసీపీ హయాంలో గేట్లతో సెట్టింగ్ లు వేసి నీళ్లు కూడా బయట నుంచి తీసుకొచ్చి నాటకాలు ఆడిన ఘటనలు చూశాం..విమానం ఎక్కేలోపు నీళ్లన్నీ ఇంకిపోయిన పరిస్థితులను చూశాం. అసెంబ్లీలో చెప్పినట్లుగానే ఎవరు అడ్డుకున్నా.. హంద్రీనీవా ద్వారా నీళ్లు తీసుకొస్తామని చెప్పాం.. చేసి చూపిస్తున్నామని చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు. రాయలసీమలో కరవు వస్తే పశువుల కోసం రైలులో నీళ్లు తెప్పించి కాపాడుకున్నాం..అలాంటి పరిస్థితి రావొద్దని హంద్రీనీవాకు శ్రీకారం చుట్టాను. నేను ఏ పని చేయలన్నా వెంకన్నపై భారం వేసి .. బుల్లెట్ మాదిరి దూసుకువెళ్తా.. వెనుదిరిగి చూడటం తనకు తెలియదని చంద్రబాబు అన్నారు. పవిత్రమైన సంకల్పంతో ఏ పని మొదలుపెట్టినా విజయం తథ్యమని, ఆ తిరుమల వెంకన్నపై పూర్తి భారం వేసి రాష్ట్రాభివృద్ధి కోసం బుల్లెట్‌లా ముందుకు దూసుకెళతానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. కరవుతో అల్లాడే రాయలసీమను రతనాల సీమగా మార్చే పూర్తి బాధ్యత తనదేనని ఆయన ఉద్ఘాటించారు. చిత్తూరు జిల్లా కుప్పం

...మిగతాది 2 లో

# గవర్నర్ కోటా నుంచి అజార్, కోదండరాం




**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 30:**

గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు అభ్యర్థులుగా కోదండరాం, అజహరుద్దీన్ పేర్లను తెలంగాణ కేబినెట్ సిఫారసు చేసింది. ఇంతకు ముందు ఈ కోటాలో కోదండరాంతో పాటు సియాసత్ పత్రిక ఎడిటర్ అమీర్ అలీ ఖాన్ ఉండేవారు. బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ దాఖలు చేసిన పిటిషన్ విచారణలో.. వారి నియామకాలను సుప్రీంకోర్టు రద్దు చేసింది. దీంతో కొత్తగా ఎమ్మెల్సీలను సిఫారసు చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కారణంగా కోదండరాం పేరును అలాగే ఉంచి.. అమీర్ అలీ ఖాన్ పేరును తప్పించి అజహర్ పేరును చేర్చారు. అజహరుద్దీన్ జూబ్లిహిల్స్ ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. తనకే టిక్కెట్ అని ప్రకటించుకున్నరాు. అయితే అనూహ్యంగా ఆయనను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా పంపడం రాజకీయవర్గాలను ఆశ్చర్య పరుస్తోంది. ఎందుకంటే ఈ ఎమ్మెల్సీ స్థానం సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఖాళీ అయింది. అమీర్ అలీ ఖాన్ ను కాదని.. అజహర్ కు చాన్స్ ఇచ్చారు.

...మిగతాది 2 లో

## కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి

# పేరు చరిత్రలో శాశ్వతం




- నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో శాశ్వతంగా ఉండే విధంగా రాష్ట్ర మంత్రిమండలిలో చర్చించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## యూరియా కొరతపై ఆందోళన

ఆరోపించారు. అందుకే ఈ కాంగ్రెస్ పాలన వద్దురా అని ప్రజలు అంటున్నారని అభిప్రాయపడుతున్నారు. BRS నేతల యూరియా ఆందోళన కార్యక్రమం కపట నాటకమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. యూరియా కొరతకు రాష్ట్ర ప్రభుత్వమా? లేక కేంద్ర ప్రభుత్వమా కారణమేదో తెలియదా అని ప్రశ్నించారు. రైతుల ముసుగులో ప్రేరేపిత ఉద్యమాలు ప్రజలు హర్షిస్తారా ? అని అనుమానం వ్యక్తం చేశారు. అధికారం లేదనే అక్కసుతో రేవంత్ ప్రభుత్వాన్ని బదనం చేయాలనే దిగజారుడు రాజకీయం ఎవరి కోసం చేస్తున్నారని మండిపడ్డారు. జియో పాలిటిక్స్ వల్ల, దేశీయ ఉత్పత్తి డిమాండ్ కు తగ్గట్టు లేక యూరియా కొరత ఉంటే రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం పై ఆరోపణలు ఎందుకు చేస్తున్నారని తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో మూడు పంట కాలాల్లో యూరియా కొరత లేని విషయం మర్చిపోతే ఎలా అని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తేనే తెలంగాణ కు యూరియా పంపిణీ చేస్తున్నారన్నారు. రైతాంగం ప్రయోజనాల కంటే మీ రాజకీయ ప్రయోజనాల కోసం మీరు చేసే నాటకాలు రైతులు నమ్మే స్థితిలో లేరని అభిప్రాయపడ్డారు.

## జపాన్ తో భారత్ భారీ ఒప్పందాలు

చేసింది. దీని ప్రధాన లక్ష్యం ఇండియాజపాన్ జాయింట్ విజన్ ఫర్ ది నెక్స్ట్ డికేడ్. ఇది ఆర్థిక వృద్ధి, భద్రత, సాంకేతికత, ఆవిష్కరణ, ఆరోగ్యం, స్థిరత్వం, చలనశీలత, ప్రజల మధ్య మార్పిడి వంటి కీలక రంగాలను కవర్ చేసే రోడ్ మ్యాప్‌గా చెప్పవచ్చు. రక్షణ, మానవ వనరుల మార్పిడి నుండి డిజిటల్ ఆవిష్కరణ, కీలకమైన ఖనిజాలు, స్వచ్ఛమైన శక్తి, అంతరిక్ష అన్వేషణ, సాంస్కృతిక సహకారం వరకు విస్తృత శ్రేణి అవగాహన ఒప్పందాలపై సంతకం ఇరు దేశాల ప్రధానులు చేశారు. ప్రధాని మోదీ, ఇద్దరు మాజీ జపాన్ ప్రధానులు యోషిహిదే సుగా, ఫ్యూమియో కిషిదాను కలిశారు. భారత ముఖ్యమంత్రులకు సమానమైన 16 ప్రిఫెక్చర్ల గవర్నర్లు ప్రధాని మోదీతో సంభాషించడానికి టోక్యోను సందర్శించారు. రెండు దేశాలు తమ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకున్నాయి. భారత్‌జపాన్ మధ్య అనేక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందాల ప్రకారం, జపాన్ భారతదేశంలో 10 బిలియన్ యెన్లకు పైగా అంటే సుమారు రూ. 5,99,354 కోట్లు పెట్టుబడి పెడుతుంది. వీటిలో పరిశ్రమ, స్వచ్ఛమైన శక్తి, మానవ వనరుల మార్పిడి ఉన్నాయి. భారతదేశం ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోంది. జపాన్ పెట్టుబడి పెరగడం భారతదేశ సామర్థ్యంపై విశ్వాసానికి సంకేతం. ప్రపంచాన్ని బెదిరించే తప్పు చేయకూడదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇది సందేశం. అమెరికాకు ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు భారతదేశం ఇతర దేశాలతో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంటోంది. భారతదేశంలో ఒక దశాబ్దంలో 10 వేల బిలియన్ యెన్లను పెట్టుబడి పెట్టాలని జపాన్ లక్ష్యంగా పెట్టుకుంది. కీలకమైన ఖనిజాలు, రక్షణ, సాంకేతికత వంటి అనేక కీలక రంగాలలో సహకారాన్ని పెంచడానికి రెండు వైపులా ఒక ప్రధాన రూట్‌మ్యాప్ సిద్ధం చేసుకున్నారు. జపాన్‌లో 15వ భారతదేశంజపాన్ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో జపాన్ ప్రధాన మంత్రి షిగేరు ఇషిబాతో భేటీ కావడం గొప్ప మైలురాయి అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆర్థిక వ్యవస్థ, ఆరోగ్యం, రవాణా రంగాల్లో భాగస్వామ్యం, AI, సైన్స్ అండ్ టెక్నాలజీ, కీలకమైన ఖనిజాలు, అరుదైన భూమి అంశాలు వంటి బహుళ రంగాలలో సహకరించుకోవడానికి రెండు దేశాల ప్రధాన మంత్రులు కట్టుబడి ఉన్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా ఖనిజ వనరుల రంగంలో జపాన్ ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం పరిశ్రమల మంత్రిత్వ శాఖ (METI)తో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ సహకార ఒప్పందం (MoC) కుదరడం సంతోషించదగ్గ విషయం అన్నారు కిషన్ రెడ్డి. ఇది మన ఇంధన భద్రత, జాతీయ భద్రత, ఆహార భద్రతా లక్ష్యాలను సాధించడమే కాకుండా నికర సున్నా ఉద్గార లక్ష్యాలను సాధించడానికి అవసరమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం విధానాలు, నిబంధనలు, కీలకమైన ఖనిజ ప్రాజెక్టుల ఉమ్మడి అభివృద్ధి, మైనింగ్ వేలం, స్థిరమైన లోతైన సముద్ర మైనింగ్, ఖనిజ వెలికితీత, ప్రాసెసింగ్, కీలకమైన ఖనిజాల నిల్వ కోసం ప్రయత్నాలలో ఇతర సంబంధిత సమాచారంతో సహా ఖనిజ వనరులపై రెండు దేశాల మధ్య సమాచార మార్పిడి జరుగనుంది. అదనంగా, రెండు దేశాల మధ్య పరస్పరం లిఖితపూర్వకంగా అంగీకరించిన ఏవైనా ఇతర రకాల సహకారాన్ని కూడా అనుసరించడం జరుగుతుందన్నారు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.

## కబ్జాకు గురవుతున్న.. భూములు

ప్రతిష్ఠాత్మకంగా నిర్మించే ఫ్యూచర్ సిటీ, జిల్లా కలెక్టర్ కార్యాలయం, టాటా ఎయిర్ స్పేస్, టీసీఎస్ లాంటి అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన కంపెనీలు, పలు విద్యా సంస్థలు, వృత్తి విద్యాకేంద్రాలు, ప్రముఖ కార్పొరేట్ దవాఖానాలు, అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. 2013లో అన్ని పంచాయతీలను కలిపి ప్రభుత్వం బడంగ్పేట్ నగర పంచాయతీని ఏర్పాటు చేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అనంతరం నగరపంచాయతీ మొదలుకొని మున్సిపాలిటీ కార్పొరేషన్ గా రూపాంతరం చెందింది. బడంగ్పేట్ కార్పొరేషన్ లో 32 డివిజన్లు ఉండగా 300కు పైగా కాలనీలలో దాదాపుగా 2 లక్షల పైగా జనాభా ఉంది. దీంతో ఈ ప్రాంతమంతా నలువైపులుగా శరవేగంగా అభివృద్ధిలో దూసుకుపోవడంతో ఇక్కడ రియల్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరజిల్లుతుంది. కార్పొరేషన్ లో గజం స్థలం ప్రాంతం బట్టి రూ.50వేల నుంచి రూ.లక్షకు పైగానే ధర పలుకుతుండటంతో అక్రమార్కుల కన్ను కార్పొరేషన్ లోని ప్రభుత్వ స్థలాల పై పడింది. తాజా మాజీలు, అధికార పలుకుబడి ఉన్న వాళ్లంతా తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి యథేచ్ఛగా పార్కు స్థలాలను చెరబట్టి రియల్ వ్యాపారాలకు తెరలేపుతున్నారు. పదేళ్ల నుంచి కార్పొరేషన్ 70వేల గజాలకు పైగా పార్క్ స్థలాలు అన్యాకాంతమయ్యాయి అంటే అతిశ యోక్తి కాదు. వాటి విలువ ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో రూ.300కోట్లకు పైగా ఉండటం గమనార్హం. ఇందులో విచిత్రం ఏమిటంటే కంచె చేను మేస్తే అనే చందంగా అధికారులు అక్రమార్కులకు ఉతమిస్తూ వారి అక్రమాలకు వంత పాడటం విశేషం. ప్రభుత్వ అనుమతితో వెంచర్లు విల్లాలు, గ్రేటర్ కమ్యూనిటీ హాల్లో నిర్మిస్తే నిర్మాణదారులు నిబంధన ప్రకారం ప్రజాప్రయోజనాల కింద 10శాతం భూమిని పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పేరిటా రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అట్టి స్థలాన్ని అధికారులు స్వాధీనం చేసుకొని భవిష్యత్తులో ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పార్కులు, కమ్యూనిటీ కేంద్రాలు, వాటర్ ట్యాంకులను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తారు. అయితే బడంగ్ పేట కార్పొరేషన్ లో ప్రజా అవసరాలకు వదిలిన ఓపెన్ ల్యాండ్ అంతా భూతద్దం పెట్టి వెతికిన అంగుళం జాగా కూడా కనపడదు. ఆ జాగా అంతా ప్రస్తుతం కాగితాలకు మీదనే ఉంది.... క్షేత్రస్థాయిలో చూస్తే అట్టి ఓపెన్ ల్యాండ్ అంతా నిర్మాణాలను వెలిశాయి. ప్రజా అవసరాలకు వదిలిన 10శాతం భూములను రియల్ మాఫియా కబంధహస్తాల్లో చేరాయి. కార్పొరేషన్ పరిధిలో వివిధ డివిజన్లో ప్లాట్లు కొని ఇల్లు నిర్మించుకున్న కాలనీవాసులు అన్యకాంతమైన 10శాతం పార్కు స్థలాల కబ్జాలను కాపాడాలని అధికారులకు మొరపెట్టుకుంటే.... కార్పొరేషన్ అధికారులే వారి వైపు జాలిగా చూస్తూ వింత సమాధానాలు చెబుతున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ లో ఆక్రమించుకున్న పార్కు స్థలాల మార్కెట్ విలువ రూ.300 కోట్లపై మాటే ఉంటుందని అధికారుల అంచనా వేస్తున్నారు.

## గవర్నర్ కోటా నుంచి...

2023 జూలైలో, గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం దాసోజు శ్రావణ్ కుమార్, కుర్రా సత్యనారాయణలను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది, కానీ అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వారి పేర్లను తిరస్కరించారు. ఎవరి పేర్లనూ సిఫారసు చేయకపోవడంతో తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 2024 జనవరిలో కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లను సిఫారసు చేసింది, దీనిని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదించారు. ఈ నామినేషన్లను తెలంగాణ హైకోర్టు 2024 మార్చిలో రద్దు చేసింది, గవర్నర్ నిర్ణయం కేబినెట్ సలహాకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. దీనిపై బీఆర్ఎస్ నేతలు కుర్రా సత్యనారాయణ, దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు కోదండరాం, అమీర్ అలీ ఖాన్‌లు ఎమ్మెల్సీలుగా ప్రమాణ స్వీకారం చేయకుండా ఆపేందుకు అంగీకరించలేదు. దీంతో వారు ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేశారు. అయితే, సుప్రీం కోర్టు 2025 ఆగస్టు 13న ఈ నామినేషన్లను రద్దు చేస్తూ, వారి నియామకం హైకోర్టు ఆదేశాలను తప్పుగా అర్థం చేసుకుని జరిగిందని, కొత్త సిఫారసుల ద్వారానే ఎమ్మెల్సీ నియామకాలు జరగాలని స్పష్టం చేసిందిదీంతో కేబినెట్ మళ్లీ రెండు పేర్లను సిఫారసు చేయాలని నిర్ణయించుకుంది. కోదండరాంను పదిహేను రోజుల్లో ఎమ్మెల్సీని చేస్తామని రేవంత్ ప్రకటించారు. ఇప్పుడు అనూహ్యంగా అజహర్ పేరుతో కలిసి సిఫారసు చేశారు.

# ఊపందుకొంటున్న స్వదేశీ ప్రచారం

**శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి. యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.**




స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు. కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది. అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది. వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది. కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి. మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది. అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది. మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు. ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ.250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది ."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు. అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు. "ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు. ''భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు.''ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు. అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది. "చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు." రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది ."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న.

విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు.. 2025 ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం. దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం. లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు. భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది. యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. 2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది. జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది. ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది. 2014 15లో భారత్ రూ.46,429 కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులను తయారుచేయగా, అది 2023 24 నాటికి 1.27 లక్షల కోట్లకు పెరిగింది.

## కుప్పానికి కృష్ణా జలహారతి

నియోజకవర్గంలోని పరమసముద్రం వద్దకు కృష్ణా జలాలు చేరుకున్న చారిత్రక సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన కృష్ణా నదికి జలహారతి ఇచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ఈ జలాలతో కుప్పానికి రెండేళ్ల ముందే కృష్ణా పుష్కరాలు వచ్చాయి. ఒకప్పుడు కరవు వస్తే పశువుల దాహం తీర్చడానికి రైళ్లలో నీళ్లు తెప్పించుకున్న దుస్థితి నుంచి, ఇవాళ 738 కిలోమీటర్ల దూరం నుంచి కృష్ణా జలాలను ఇక్కడికి తీసుకురాగలిగాం. ఇది తెలుగుదేశం ప్రభుత్వ ఘనత. మల్యాల నుంచి 27 లిఫ్ట్ ఇరిగేషన్ల ద్వారా నీటిని తరలించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చెరువులను నింపే అవకాశం ఇప్పుడు కలిగింది" అని వివరించారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించగలిగితే తన జన్మ సార్థకమవుతుందని ఆయన భావోద్వేగంగా అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "201419 మధ్య కాలంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం మేము రూ.12,500 కోట్లు ఖర్చు చేస్తే, వైసీపీ ఐదేళ్ల పాలనలో కేవలం రూ.2 వేల కోట్లతో సరిపెట్టింది. వాళ్లు అసత్యాలు చెప్పడంలో దిట్టలు. గేట్లతో సెట్టింగ్‌లు చేసి నీళ్లు తెచ్చినట్లు నాటకాలడటం తప్ప చేసిందేమీ లేదు. మేము కష్టపడి నీళ్లు తీసుకొస్తే ఇప్పుడు జీర్ణించుకోలేకపోతున్నారు" అని మండిపడ్డారు. మంచి పనులను అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీ ఒక విషవృక్షంగా మారిందని, దమ్ముంటే అభివృద్ధి, సంక్షేమంలో పోటీ పడాలని సవాల్ విసిరారు. భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, హంద్రీనీవా ఫేజ్ 1, ఫేజ్ 2 ప్రాజెక్టుల ద్వారా 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించడంతో పాటు పరిశ్రమలకు కూడా నీళ్లు ఇస్తామని తెలిపారు. "ఇప్పుడు కుప్పానికి నీళ్లు వచ్చాయి. రాబోయే ఏడాది కాలంలోగా హంద్రీనీవా ద్వారా చిత్తూరుకు కూడా నీళ్లు ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటున్నాను" అని హామీ ఇచ్చారు. పోలవరంబనకచర్ల అనుసంధానం పూర్తి చేసి, వంశధార నుంచి పెన్నా నది వరకు నదులను అనుసంధానిస్తే రాష్ట్రంలో కరవు అనే మాటే వినిపించదని స్పష్టం చేశారు. నీళ్లు లేని పరిస్థితి వస్తేనే నీటి విలువ తెలుస్తుందని, భూమిని కూడా ఒక జలాశయంగా మార్చడం ఎంతో ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. నదుల అనుసంధానం ప్రయోజనాలను తెలంగాణ నేతలు కూడా గ్రహించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

" సాగు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది" అని చంద్రబాబు అన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా సీమ ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మ 738 కి.మీ. ప్రయాణించి కుప్పానికి చేరడం గొప్ప విజయమని అన్నారు. ఇది రికార్డు స్థాయి పఅన్నారు. గతంలో ఎన్‌టీఆర్ రాయలసీమను ఆకుపచ్చగా మార్చాలని కలలు కన్నారు. ఆ కలను తాను సాకారం చేస్తున్నానని, సీమ పల్లెల్లోకి నీళ్లు పారించడం ద్వారా పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అందుతున్నాయని ప్రసంగించారు. ఇది రాష్ట్ర ప్రగతికి మైలురాయి అని చెప్పారు. పోలవరం, వెలుగొండ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రం మరింత ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు వద్దకు వచ్చేటప్పుడు మహిళలు, రైతులతో కలిసి కుప్పం బ్రాంచ్ కెనాల్ వరకు బస్సులో ప్రయాణించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. కుప్పంలో రప్పా రప్పా రాజకీయం చేయాలనుకున్నారు.. కానీ పులివెందుల, ఒంటిమిట్టలో ఏం జరిగింది.. అంటూ చంద్రబాబు వివరించారు. కుప్పం నియోజకవర్గానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తున్నాం.. అంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గతంలో సినిమా సెట్టింగ్ వేసి మోసం చేసిన చరిత్ర వైసీపీది.. నీటి విలువ తెలిసిన పార్టీ తెలుగుదేశం అంటూ చంద్రబాబు పేర్కొన్నారు. రాయలసీమ ఒకప్పుడు రతనాల సీమ, ఇప్పుడు రాళ్ల సీమగా మారిందన్నారు. డిసెంబర్‌లో కుప్పంలో ఎయిర్‌పోర్టు ప్రారంభిస్తామని.. చంద్రబాబు పేర్కొన్నారు.

## కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో శాశ్వతం

✍ జయభేరి, హైదరాబాద్ :



నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి పేరు చరిత్రలో శాశ్వతంగా ఉండే విధంగా రాష్ట్ర మంత్రిమండలిలో చర్చించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. “సిద్ధాంతాలు చెప్పడమే కాదు. నమ్మిన సిద్ధాంతం కోసం 65 సంవత్సరాలు నిబద్ధతతో జీవించడం ద్వారా సురవరంకి ఆ గౌరవం దక్కింది. వారు ఏ జెండాను మోశారో, ఏ జెండా మోయడం గొప్పగా భావించారో.. చివరి శ్వాస తర్వాత కూడా ఆ జెండా నీడనే విశ్రమించడం అత్యంత అరుదు. ప్రజలతో గుర్తింపబడిన మహనీయుల పేర్లు ఈ రాష్ట్రంలో శాశ్వతంగా నిలవాలి. అందుకే తెలుగు విశ్వ విద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు, కోఠి మహిళా విద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టుకున్నాం. సామాన్య ప్రజల్లో చైతన్యం నింపి గోల్కొండ కోటను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న అందరికీ స్ఫూర్తిగా నిలవాలని ట్యాంక్‌బండ్‌పై వారి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకుంటున్నాం. ఒక ప్రాంతం నుంచి సమాజంలో గుర్తింపు పొందిన ఉన్నప్పుడు చెప్పుకోవడానికి ఆ ప్రాంత వాసులకు గర్వంగా ఉంటుంది. మొదటి తరంలో సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణా రావు, రెండో తరంలో జైపాల్ రెడ్డి, సురవరం సుధాకర్ రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు వన్నె తెచ్చారు. వారెప్పుడు సమాజంలో గౌరవం పొందుతూనే ఉంటారు. విజయలక్ష్మి చిన్న కోరికలు కోరారు. వారి గౌరవం ఆలంపూర్ శాసనసభ నియోజకవర్గానికే కాదు. సురవరం సుధాకర్ రెడ్డి గౌరవం, రాష్ట్ర స్థాయిలో ఉండే విధంగా శాశ్వతంగా గుర్తుంచుకునే విధంగా మంత్రివర్గంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటాం. ప్రస్తుతం సమాజంలో ప్రజాస్వామిక మూల సిద్ధాంతానికి విరుద్ధంగా పెరిగిపోతున్న విపరీత పోకడలను అడ్డుకోవలసిన అవసరం ఉంది. ప్రజల ప్రాథమిక హక్కులను హరించే ప్రమాదకర పరిస్థితులను తలెత్తుతున్నాయి. ప్రజలను చైతన్యపరిచే ఆలోచన ఎవరూ చేయడం లేదు. అందుకోసం ఐక్య కార్యాచరణ నిర్మించుకోవాలి. అప్పుడే సురవరం లాంటి నేతకు ఘనమైన నివాళి..” అని ముఖ్యమంత్రి అన్నారు.

# బాలగంగాధర్ తిలక్ స్ఫూర్తితో గణేష్ మండపం

- గుండ్లపోచంపల్లి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు

**జయభేరి, మేడ్చల్ :**

విఘ్నాలు తొలగి శుభాలు అందించే వినాయకుడి వేడుకలను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిర్వహించే 'గణేశ్ నవరాత్రి మహోత్సవాలు' వాడవాడలా అంగరంగ వైభవంగా వివిధ రూపాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో హిందువులను సంఘటితం చేసి వినాయక నవరాత్రి ఉత్సవాలను స్వాతంత్ర పోరాటంలో భాగం చేయాలని పండుగను దేశవ్యాప్తం చేసిన గొప్ప వ్యక్తి స్ఫూర్తితో మండపానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన బాలగంగాధర తిలక్, ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫోటోలు పండుగ మూలలను గుర్తు చేస్తూ అందరిని ఆకట్టుకుంటుంది. ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులు నిర్వహించే వినాయక నవరాత్రి వేడుకలలో అన్నదానం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.





**బాలగంగాధర్ తిలక్ ఆలోచనతో దేశవ్యాప్తంగా వేడుకలు**

1893కు ముందు వినాయక చవితిని ఇళ్ళలోనే జరుపుకునేవారు. వినాయకుని విగ్రహాలు పెట్టడం, నిమజ్జనం చేయడం ఉండేవి కావు. పైగా బ్రిటీష్ పాలకుల కాలంలో సామూహికంగా ఎటువంటి కార్యక్రమాలు జరపడానికి అవకాశం ఉండేది కాదు. దేశ స్వతంత్ర్యకాంక్షను రగిలించడంకోసం, యువతను ఏకం చేసేందుకు వినాయక చవితి వేడుకలే సరైన మార్గమని ఆలోచించి, బాలగంగాధర తిలక్ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించడం, భజనలు, పూజలు చేయడం లాంటి కార్యక్రమాలకు తెరతీశారు. 1894లో మహారాష్ట్రలోని పుణె కేంద్రంగా సార్వజనిక్ గణేశ్ ఉత్సవ్ పేరిట గణేశ్ ఉత్సవాలకు నాంది పలికింది. అప్పటి నుంచి గణపతి ఉత్సవాలను సామాజిక వేదికలుగా చేసి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించారు. ప్రజల నుండి విశేష స్పందన రావడం, ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులను ఆంగ్లేయులు నిర్బంధించలేకపోవడంతో వినాయకుని సాక్షిగా స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. పూజాకార్యక్రమాలు, ఆ తర్వాత జాతీయోద్యమానికి సంబంధించిన పాటలు, ఉపన్యాసాలు ఈ నవరాత్రుల్లో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశారు తిలక్. జాతీయోద్యమ నాయకులకు కూడా ప్రజల్ని చైతన్యవంతులను చేయటానికి ఈ మండపాలు మంచి వేదికగా నిలిచాయి. తరువాతి సంవత్సరం నుంచి ఈ ఉత్సవాలు ఏ ఒక్కచోటక పరిమితం కాకుండా యావత్ భారతావనికి పాకాయి. కులమతాలకు అతీతంగా ఏకం అయి ఈ కార్యక్రమాలకు ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేవారు. దేవాలయాల్లో కన్పించే అంటరానితనం కూడా ఈ మండపాల కారణంగా కనుమరుగవటం ఆరంభమైంది.




## రేవంత్ దోషం.. రైతన్నకు మోసం


- గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా

**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న ఎరువుల సంక్షోభంపై భారత రాష్ట్ర సమితి వినూత్న నిరసన ప్రదర్శన.. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద ఖాళీ యూరియా బస్తాలతో నిరసన.. యూరియా సంక్షోభానికి కారణం కాంగ్రెస్ పార్టీ అంటూ నినాదాలు.. పండగపూట కూడా రైతన్నలను రోడ్లపై నిలబెట్టింది ఈ ప్రభుత్వం వరకు... "గణపతి బప్పా మోరియా.. కావాలయ్యా యూరియా" అంటూ నినాదాలు.. రైతన్నలకు ఎరువులు సరఫరా చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే దిగిపోవాలని నినాదాలు.. రైతన్నలకు యూరియా వెంటనే సరఫరా చేయాలని నినాదాలు... "రేవంత్ దోషం.. రైతన్నకు మోసం" అంటూ నినాదాలు.

## గణనాథునికి ప్రత్యేక పూజలు.. అన్నదానం

- మూసాపేట్ డివిజన్ లో పలు గణనాథులను దర్శించుకున్న మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్



**జయభేరి, మూసాపేట్ :**

మూసాపేట్ యువజన సంఘం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుని వద్ద తూము శ్రావణ్ కుమార్ యువసేన సౌజన్యంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, తూము మనోజ్, శశాంక్, తదితరులు పాల్గొన్నారు.





## స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలి

**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 30:**

విద్యార్థులకు స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ ను ప్రభుత్వం విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పు సాయికిరణ్ అన్నారు. శనివారం తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో 8300 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ లను విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనం అయిందని అన్నారు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని అన్నారు. స్కాలర్షిప్లు అందని కారణంగా కళాశాల యజమాన్యాలు విద్యార్థులకు టీసీలు, మెమోలు ఇవ్వడం లేదని అన్నారు. దీంతో పై చదువులకు అడ్డంకులు ఏర్పడుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారుతున్న విద్యావ్యవస్థ తీరు మాత్రం మారడం లేదని అన్నారు. పేద విద్యార్థులకు విద్య దూరం చేసే కుట్ర జరుగుతుందని అన్నారు.

## మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ లో వినాయక పూజలు

- మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి,ఫీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు

**జయభేరి, మేడిపల్లి :**

మేడిపల్లి ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వినాయక పూజలు శోభాయమానంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడిపల్లి ఇన్స్పెక్టర్ గోవింద్ రెడ్డి, ఫీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అతిథులకు శాలువాతో సన్మానించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. వినాయకుని ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితంలో శ్రేయస్సు నెలకొని, సమాజంలో ఐకమత్యం పెంపొందాలని ఆకాంక్షించారు. పూజలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలనూ చేపట్టాలని ప్రెస్ క్లబ్ ప్రతినిధులను పిలుపునిచ్చారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, విద్యా సహాయం, రక్తదాన శిబిరాలు వంటి సేవా కార్యక్రమాలను జర్నలిస్టులు ముందుండి నిర్వహిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ ఆద్యక్షులు చీర్ల శ్రీదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వడ్డేమాను సుందర్, కోశాధికారి మరాటి మల్లేష్, ముఖ్య సలహాదారులు వి సూర్యనారాయణ రెడ్డి, కల్కూరి ఏల్లయ్య, క్లబ్ సభ్యులు సాగర్ రెడ్డి, రాము యాదవ్, మోతె రఘు తిరుపతి రెడ్డి, షేరి కరుణాకర్ రెడ్డి, భూస గణేష్, రావు నాగిరెడ్డి, చిన్నం గణేష్, దయాకర్ రెడ్డి, భగీరథ రెడ్డి, అంజన్ కుమార్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





## వరద నీటి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు




**జయభేరి, ఎల్బీనగర్ :**

ఎల్బీనగర్ నియోజకవర్గంలో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణానికి ఆరు కోట్ల రూపాయలు మంజూరు అయినట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. శనివారం జరిగిన జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ సూచన మేరకు సమావేశంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో వరద నీటి కాల్వల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన వెంటనే హయత్ నగర్ కుమ్మరి బస్తి నుండి బస్ డిపో ప్రాంతంలోని రాఘవేంద్ర నగర్ కాలనీ వరకు స్ట్రాం వాటర్ డ్రైనేజీ నిర్మాణం కోసం 6 కోట్లు నిధులు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీలో మంజూరు చేసినట్లు తెలిపారు. హస్తినాపురం డివిజన్ ఏపీ ఎస్ ఈబి కాలనీ నుండి పంచాయతి రాజ్ టీచర్స్ కాలనీ వరకు వరద నీటి కాలువ నిర్మాణానికి 10 కోట్లు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదించగా త్వరలో అట్టి పనులకు నిధులు మంజూరు చేయనున్నట్లు స్టాండింగ్ కమిటీలో మేయర్ విజయలక్ష్మి తెలిపినట్లు తెలిపారు. నియోజకవర్గంలో వరద నీటి కాల్వల నిర్మాణానికి ఎక్కడ అవసరం ఉన్నా స్టాండింగ్ కమిటీ ద్వారా నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

## పేద విద్యార్థుల చదువు దూరం చేసే కుట్ర

- నిరసన తెలిపిన ప్రజాసంఘాల నాయకులు
- ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది
- ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్


**జయభేరి, షాద్ నగర్, ఆగస్టు 30 :**



కొన్ని చిన్న చిన్న సాకులు చూపిస్తూ కొందుర్గు మండల కేంద్రంలో ఉన్న గురుకుల బాలుర పాఠశాలను తరలించే కుట్రను మానుకోవాలని ప్రజాసంఘాలు గళమెత్తాయి. కొందుర్గు మండల కేంద్రంలో రోడ్డుకు అడ్డంగా బేటాయించి ఇక్కడ నుండి తరలించవద్దని నిరసన తెలిపారు. ఇప్పటికే విద్యలో చాలా వెనుకబడి పోయిందని, ఇక్కడి నుండి తమ ప్రాంతాలకు కాకుండా వేరే ప్రాంతాలకు తరలిస్తే పేద విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటారని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంతో ట్రాఫిక్ సమస్య తలెత్తడంతో పోలీసులు జోక్యం చేసుకొని నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ప్రజాసంఘాల నాయకులు, విద్యాసంస్థల పట్ల ఆసక్తి కలిగిన స్థానికులు మాట్లాడుతూ ...స్వార్థపరులు సృష్టించిన చిన్న చిన్న సమస్యలను బూచిగా చూపించి గురుకుల బాలుర పాఠశాలను తరలించే ప్రయత్నం జరుగుతోంది. ఇది పేద విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తరలించే కుట్రను తక్షణమే విరమించుకోవాలని, లేకపోతే ప్రజలు తీవ్ర ఆందోళనకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్ నాయక్ మాట్లాడుతూ;గురుకుల బాలుర పాఠశాలను ఇక్కడి నుండి తరలిస్తే తీవ్ర పరిణామాలు తప్పవు. ఈ ప్రాంతం ముందే వెనుకబడింది. విద్యా వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అధికారులే, విద్యను దూరప్రాంతాలకు తరలించడం ద్వారా ప్రజలను ఇబ్బందులకు గురి చేయకూడదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల ఆకాంక్షలు, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని గురుకుల బాలుర పాఠశాలను మండల కేంద్రంలోనే కొనసాగించాలంటూ ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శన్, నిరటి రాజు , శివ మణికంఠ, సంతోష్, ఫయాజ్, సంతోష్ నాయక్, రమేష్ శంకర్, గణేష్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం

జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



**జయభేరి, ఎల్బీనగర్ :**

బియన్ రెడ్డి నగర్ డివిజన్ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వీ కర్ణన్ IASకి బి యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ కమీషనర్ ని కోరడం జరిగింది. హనుకూలంగా స్పందించిన కమిషనర్ డివిజన్ అభివృద్ధికి అతి త్వరలోనే ప్రతి సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలియజేయడం జరుగుతుంది.

## Dr. రాములు నాయక్ మృతి తీరని లోటు



**జయభేరి, దేవరకొండ :**

పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు నేనావత్ రాములు నాయక్ పేదలకు చేసే వైద్య సేవే ఆస్తిగా భావించి చిట్ట చివరి శ్వాస వరకు పని చేయడం కన్నా గొప్ప విశ్రాంతి లేదని.. మమ్మల్నీ వీడి దీవికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన జాలే నరసింహారెడ్డి పీసీసీ సభ్యులు PACS చైర్మన్.

## అసెంబ్లీకి రాను : రాజగోపాల్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 30 :**

కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరో సంచలన ప్రకటన చేశారు. మద్ధతుదారులతో అసెంబ్లీకి వచ్చిన ఆయన ఇకపై సభకు రానని అన్నారు. ప్రజలంతా వరద కష్టాల్లో ఉన్నారని వారికి అండగా ఉండాలనే ఉద్ధేశంతో ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపారు. చాలా కాలంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా స్టేట్మెంట్స్ చేస్తూ వస్తున్నారు. మంత్రి పదవి ఆశించి భంగపడిన కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రెషర్ పాలిటిక్స్‌కు మరింత పదును పెట్టారు. అందులో భాగంగా అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండబోతున్నట్టు ప్రకటించారు. ప్రజలంతా వరద కష్టాల్లో ఉన్నారని వారికి అండగా ఉంటానంటూ వెల్లడించారు. ఓవైపు రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తితే వాటిని పట్టించుకోకుండా అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడం ఏంటనే కోణంలో ఆయన సరికొత్తగా ఒత్తిడి పెంచుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందు రాజగోపాల్ రెడ్డి తన మద్ధుతుదారులతో భారీ ర్యాలీగా అమరువీరుల స్థూపం వద్ద నివాళి అర్పించారు. తన అనుచరులు ముఖ్య నాయకులతో కలిసి అక్కడ కాసేపు గడిపారు. అనంతరం అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఈ టైంలోనే మీడియాతో మాట్లాడుతూ సంచలన ప్రకటన చేశారు. "అమరవీరుల స్థూపం అంటే గుడితో సమానం. రాష్ట్రం కోసం ప్రాణాత్యాగం చేసిన అమరవీరులు ప్రజల గుండెల్లో సజీవంగా బ్రతికి వుంటారు. ఈ రోజు అసెంబ్లీ తరువాత మళ్ళీ అసెంబ్లీకి రాను. ప్రజలు వరద కష్టాల్లో ఉన్నారు. వారికి అండగా ఉండాల్సిన సమయం ఇది. వరద ప్రాంతాల్లో పర్యటిస్తా, వారికి అండగా ఉంటాను." అని చెప్పుకొచ్చారు.

# ప్రజలు రానున్న ఎన్నికల్లో ఓడించండి బుద్ధి చెప్పాలి

- నిధులు మంజూరు చేయకుండా గ్రామపంచాయతీ వ్యవస్థని నాశనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ
- ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలు రానున్న ఎన్నికల్లో తమ ఐక్యత, సత్తా చాటాలి
- బహుజనుల అభివృద్ధి కోసం సామాజిక న్యాయం కోసం నిరంతరం పాటుపడుతున్న బీఎస్పీకి అధికారం ఇవ్వాలి



**జయభేరి, చర్ల, ఆగస్టు 30 :**

చర్ల మండలంలో బహుజన్ సమాజ్ పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం చర్ల మండల కేంద్రం లోని బిఎస్పి పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పార్టీ చర్ల మండల అధ్యక్షు లు కొండా కౌశిక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామపంచాయతీ వ్యవస్థను సర్వనాశనం చేస్తుందని ఈ చర్యలను బహుజన్ సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండి స్తుందని తెలిపారు ప్రభుత్వం ఏర్పాటైన నాటినుండి పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని విమర్శించారు గ్రామస్థాయిలో నిధులు లేక పరిపాలన అస్తవ్యస్తంగా తయారైందని పరిపా లన భారం పూర్తిగా కార్యదర్శులు అధికారులపై పడుతుందని ఆరోపించారు నిధులు లేక గ్రామంలో వర్షాకాలం అయినప్పటికీ కూడా చల్లే పరిస్థితి లేదని క్రిమిసంహారక రసాయనాలు పిచికారి చేసే పరిస్థితి లేదని పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేటువంటి పరిస్థితులు లేదని దీని అంతటికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమేనని విమర్శించారు ప్రజల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేనట్టుగా ప్రజా సమస్యల పరిష్కరించడం లో ఏమాత్రం శ్రద్ధ లేనట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటు అని విమర్శించారు ప్రజా సమస్యల పరిష్కరించలేని విధంగా ఉన్నటువంటి కాంగ్రెస్ విధానాన్ని ప్రజలు గుర్తించాలని బహుజనులను రాజ్యాధికారంలోకి తీసుకురావాలని బహుజనుల అభివృద్ధి కోసం బహుజనులకు సామాజిక న్యాయం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న బీఎస్పీకి అధికారం ఇవ్వడం ద్వారానే ఈ సమస్యను పరిష్కారం అవుతాయని ప్రజలు గుర్తించాలని తెలిపారు ఎస్సీ ఎస్టీ బీసీ మత మైనారిటీ ప్రజలు తమ కోసమే ఏర్పాటైనటువంటి బీఎస్పీని ఆదరించాలని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో బీఎస్పీ చర్ల మండల ఉపాధ్యక్షులు చెన్నం మోహన్, చర్ల మండల కోశాధికారి ఎస్కే. జహీరుద్దీన్ భాష చర్ల సెక్టార్ కార్యదర్శి అయినవల్లి శ్రీను, పార్టీ చర్ల మండల నాయకులు చెన్నం పవన్ తదితరులు పాల్గొన్నారు.



## విహారిక సి సెక్టార్ కాలనీ ఘనంగా గణపతి నవరాత్రులు

- ముఖ్య అతిథిగా పూజలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**

వినాయక చవితిని పురస్కరించుకొని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో విహారిక సి సెక్టార్ లో గణనాథుని నాల్గవ రోజు పూజ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, విజయ్ కుమార్, శ్రీనివాస్ రావు, కిరణ్ కుమార్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. దంపతులను సన్మానించిన మాజీ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షాకార్యదర్శులు ఉత్సవ చైర్మన్, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, పెద్దలు, మహిళలు తదితరులు భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదలు స్వీకరించారు.

## రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 30:**

తుర్కపల్లి మండల కేంద్రంలో బిజెపి మండల పార్టీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నిర్వహించిన బహిరంగ సభలో ఆర్జెడి నాయకులు మోడీ తల్లి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సందర్భంగా రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేసినట్టు తెలిపారు. ఆయన వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల సైదులు, జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా, జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి మాలోతు రమేష్ నాయక్ ,ఉపాధ్యక్షుడు బానోతు శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బినారం కనకయ్య, గోర్ల రామచంద్రం, పెండెం నరసింహులు, గుండెబోయిన మల్లేశం, ఆకుల భాస్కర్, ఆకుల శ్రీను, కందుకూరి వేణు, నాగరాజు, ప్రసాద్, భాను ప్రసాద్ ,బోగీకర్ శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షునికి సన్మానం



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 30:**

తుర్కపల్లి మండలం బిల్యా నాయక్ తండాకు చెందిన మాలోతు రమేష్ నాయక్ ను లంబడి హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నిక అయినందున మండల గిరిజన నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రమేష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి లంబడి హక్కుల పోరాట సమితి అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు మండల గిరిజన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అన్నారు. గిరిజన సమస్యల పోరాటానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రుణావత్ లచ్చు నాయక్, గుగులోతు భాస్కర్ నాయక్, మాలోతు సుధాకర్ నాయక్, గుగులోతు నరేందర్ నాయక్, గుగులోతు బన్సీ నాయక్, శ్రీను నాయక్, ఇస్మాయిల్ నాయక్ పాల్గొన్నారు.

## మండల స్థాయి రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం



**తుర్కపల్లి, ఆగస్టు 30:**

తుర్కపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్థాయి రాజకీయ పార్టీ నాయకులతో ఎంపీడీవో లెంకల గీతారెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచ్, వార్డు సభ్యుల పోలింగ్ స్టేషన్లో, ఓటర్ జాబితా పై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు ధనావత్ శంకర్ నాయక్, చాడ భాస్కర్ రెడ్డి, ఎరుకల వెంకటేష్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు పరమేష్ యాదవ్, గిద్దె కరుణాకర్, బిజెపి పార్టీ ప్రతినిధులు మేకల శ్రీనివాస్ యాదవ్ ,కనకయ్య, సిపిఎం పార్టీ ప్రతినిధి పోతరాజు జహంగీర్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, పర్యవేక్షకులు వినోద్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

## సభాపతి అధ్యక్షతన బీఏసీ భేటీ

**జయభేరి, హైదరాబాద్:**

అసెంబ్లీలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అధ్యక్షతన శాసనసభ భవనంలోని స్పీకర్ ఛాంబర్ లో జరిగిన అసెంబ్లీ బిజినెస్ అడ్వైజరి కమిటీ (BAC) సమావేశం జరిగింది. న సభ్యులు ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ , విప్ బీర్ల ఐలయ్య, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు,బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తదితరులు హజరయ్యారు.

## డాక్టర్ రాములు మృతి చాలా బాధాకరం

- పవిత్రమైన వైద్య వృత్తినే దైవంగా భావించే మహోన్నత వ్యక్తి డాక్టర్ రాములు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

డాక్టర్ రాములు నాయక్ మృతి బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు ,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు శనివారం దేవరకొండ పట్టణంలో రాములు నాయక్ మృతి దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....డాక్టర్ ఎన్ రాములు నాయక్ గారి మృతి దేవరకొండ నియోజకవర్గ ప్రజానీకానికి తీరనిలోటు అని అన్నారు.డాక్టర్ రాములు నాయక్ పేద ప్రజలకు చేసిన సేవ చిరస్మరణీయం అని ఆయన కొనియాడారు.పవిత్రమైన వైద్య వృత్తినే దైవంగా భావించే మహోన్నత వ్యక్తి డాక్టర్ రాములు నాయక్ అని అన్నారు. అందరితో స్నేహంగా ఉండి, సమాజంలో గౌరవమైన స్థానాన్ని సంపాదించుకున్న మహోన్నతమైన వారు డాక్టర్ రాములు నాయక్ అని ఆయన తెలిపారు. డాక్టర్ రాములు నాయక్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వైద్యులు దేవుళ్ళతో సమానం అన్న పదానికి అర్థంలాంటి వారు డాక్టర్ రాములు నాయక్ అని అన్నారు. దేవరకొండ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సూపరిండెంట్ గా సుధీర్ఘ సేవలు అందించి పేద ప్రజల జీవితంలో ఆపద్బాంధవుడుగా నిలిచిన వ్యక్తి డాక్టర్ రాములు నాయక్ అని ఆయన అన్నారు.డాక్టర్ గా మీ ప్రస్తానం మొదలుకొని ఆసుపత్రిలో సూపరిండెంట్ గా సేవలు చేయడం జరిగింది అని ఆయన గుర్తు చేశారు. అర్ధ రాత్రి సమయాల్లో కూడా మీకు నేనున్నాను అంటూ వైద్య సేవలు అందించడంలో మీ కృషి అద్భుతం అని ఆయన కొనియాడారు.పవిత్రమైన వైద్య వృత్తినే దైవంగా భావించే మహోన్నత వ్యక్తి,అందరితో స్నేహంగా ఉండి,సమాజంలో గౌరవమైన స్థానాన్ని సంపాదించుకున్న డాక్టర్ ఎన్ రాములు నాయక్ అని ఆయన అన్నారు. ఆయన వెంట పలువురు బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



## వీధి కుక్కల దత్తత కార్యక్రమం

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ లోని 16 వ వార్డు నందు వీధి కుక్కల దత్తత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొని 8 మందికి వీధి కుక్కల ద్వారా జన్మనిచ్చిన కుక్కపిల్లలను దత్తత ఇవ్వడం జరిగింది. మరియు 25 వీధి కుక్కలకు టీకాలు వేయడాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలికల పాఠశాల నందు వీది కుక్కల నియంత్రణ మరియు వాటి నుండి సోకే రాబిస్ వ్యాధి గురించి తీసుకోవలసిన జాగ్రతల గురించి విద్యార్థులకు అవగాహన ఇవ్వడం జరిగింది. అనంతరం స్కూల్ ఆవరణలో విద్యార్థులతో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి పర్యావరణ సమతుల్యతల గురించి విద్యార్థులకు వివరించారు. ఇట్టి కార్యక్రమంలో ఆర్ డి ఓ రమణా రెడ్డి, వెటర్నరీ డిపార్ట్మెంట్ జాయింట్ డైరెక్టర్, మునిసిపల్ కమీషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, మండల విద్యాధికారి మాతృనాయక్, ప్రిన్సిపాల్ రెబక, మునిసిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ శంకర్, అసిస్టెంట్ ఇంజనీర్ రాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులు స్నేహభావంతో మెలగాలి




**జయభేరి, మేడ్చల్ :**

ప్రతి విద్యార్థిని తమ సీనియర్,జూనియర్ విద్యార్థినులతో స్నేహ భావంతో మెలగాలని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్ఈసీడబ్ల్యూ కళాశాలలో శనివారం ఇంటరాక్షన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థినులు జూనియర్ విద్యార్థులతో కలిసిమెలిసి ఉండాలన్నారు. సీనియర్,జూనియర్ల మధ్య అనుబంధం భవిష్యత్ వికాసానికి ఎంతో అవసరం అన్నారు. విద్యార్థినులు ఎమ్మార్సీఈడబ్ల్యూ కళాశాలలో ఒక కుటుంబంలా భావించి కుటుంబ సభ్యురాలిగా మెలగాలన్నారు. క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్‌లో లక్ష్యాలను సులువుగా చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఫ్యాషన్ షో, డ్యాన్స్, సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.




## పార్టీని బలోపేతం చేయడమే గ్యానం సారయ్యకు మనమిచ్చే నివాళి

- నాలుగో వర్ధంతి సభలో సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్




**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 30 :**

నిస్వార్థమైన కమ్యూనిస్టు నాయకుడు. కడవరకు ఎర్రజెండా వీడని వ్యక్తి పేద, పీడిత ప్రజల కోసం దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి గ్యానం సారయ్య.పార్టీని మండలంలో బలోపేతం చేయడమే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఐ(ఎం )కార్యదర్శివర్గ సభ్యుడు బండారి రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డిలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.శనివారం స్థానిక సొసైటీ కార్యాలయం మండపం వద్ద గ్యానం సారయ్య నాలుగవ వర్ధంతిసభ కుమ్మరి శ్రీను అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న బండారి రవికుమార్,కృష్ణారెడ్డి మాట్లాడుతూ ... మండలంలో ప్రజలకు,పార్టీలో కార్యకర్తలకు సుపరిచితమైన పేరు గ్యానం సారయ్యది అన్నారు.పీడిత పేద ప్రజల కోసం పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు.మండలంలో తౌలికాకు కట్ట రేటు,కూలి రేటు, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తి సారయ్య అన్నారు. నిర్బంధాలు,పెత్తందారీ వ్యవస్థకు ఎదురొడ్డి మండలం మండలంలో ఎదుగుదలకు పాటుపడిన వ్యక్తి అన్నారు.

ఏజెన్సీలో ఎర్రజెండా ఎగరడం వేయడమే మనము ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ముందు జ్ఞానం సారయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి రెడ్డి సాంబశివ,జిల్లా కార్యదర్శి సభ్యులు తుమ్మల వెంకటరెడ్డి,ఎండి దావూద్, కొప్పుల రఘుపతి,వంకా రాములు,మండల కార్యదర్శి గ్యానం వాసు,నాయకులు చారి, మాణిక్యం పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న ప్రణబ్ ముఖర్జీ వర్ధంతి

- తెలంగాణ రాష్ట్ర బిల్లును ఆమోదించిన ప్రణబ్ ముఖర్జీ కి నివాళులు అర్పిద్దాం



ప్రణబ్ కుమార్ ముఖర్జీ భారతదేశ రాజకీయ నాయకుడు. ప్రణబ్ ముఖర్జీ డిసెంబరు 11, 1935న పశ్చిమ బెంగాల్ లోని బిర్భుమ్ జిల్లా మిరాఠీ గ్రామంలో బెంగాలీ కులీన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. అతను భారతదేశానికి 2012 నుండి 2017 వరకు 13వ రాష్ట్రపతిగా బాధ్యతలను నిర్వర్తించాడు. తన ఆరు దశాబ్దాల రాజకీయ జీవితంలో అతను భారత జాతీయ కాంగ్రెస్లో సీనియర్ నాయకునిగా ఉన్నాడు. కేంద్రప్రభుత్వంలో అనేక మంత్రిత్వ పదవులను నిర్వహించాడు. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు అతను కేంద్ర ఆర్థిక మంత్రిగా 2009 నుండి 2012 వరకు తన సేవలనందించాడు. ఫిబ్రవరి 20న పార్లమెంటు ఆమోదం పొందిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2014 కు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ తన సంతకంతో ఆమోదం తెలపడంతో దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడింది. పార్టీలతో సంబంధం లేకుండా రాజకీయ వర్గాల్లో ప్రణబ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. మేధావిగా, సంక్షోభ పరిష్కర్తగా ఆయనకెవరూ సాటి రారని రాజకీయ పక్షాలు అంటూంటాయి. ఈయన చేసిన సేవలకు గాను 2019లో కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించి గౌరవించింది. తనకు కోవిడ్19 వ్యాధి వచ్చినట్లుగా ప్రణబ్ ముఖర్జీ, 2020 అగస్టు 20 న ట్విట్టర్లో ప్రకటించాడు. బాత్‌రూములో జారి పడినందున సైనిక ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మెదడుకు ఆపరేషను జరిగింది. ఆ తరువాత ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షనుతో 2020 ఆగస్టు 31 న ప్రణబ్ మరణించాడు.

# పరవాడలో ఏటిఎం మోసగాళ్ల అరెస్ట్

**జయభేరి, పరవాడ:**



అనకాపల్లి జిల్లా, పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌బిఐకి చెందిన పెర్తో కంపెనీ ఎటిఎంలను లక్ష్యంగా చేసుకుని నగదు అపహరించిన ఇద్దరు అంతర్రాష్ట్ర నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.పరవాడ పోలీస్ స్టేషన్ వారు చెప్పిన వివరాలు లోకి వెళ్ళితే 2025 ఆగస్టు 27న వెన్నెలపాలెం అయ్యబాబు కాంప్లెక్స్, దేశపాత్రునిపాలెం ఎటిఎంలలో నిందితులు ప్రత్యేక పద్ధతిలో నగదు అపహరించారని ఈ రీతిలో వెన్నెలపాలెం ఎటిఎంలో రూ.10,000/ మరియు దేశపాత్రునిపాలెం దగ్గిర ఎటిఎంలో రూ.4,200/ మొత్తం రూ.14,200/ అపహరించారని దీనిపై పరవాడ సి ఐ ఆర్ మల్లికార్జున రావు కేసు నమోదు చేశారు.

ఈ ఘటనపై కంఠంరెడ్డి సోమునాయుడు (38), ఛానెల్ ఎగ్జిక్యూటివ్, హిటాచి కంపెనీ 28082025న పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని . కమాండ్ సెంటర్ అలర్ట్ ఆధారంగా సీసీటీవీ ఫుటేజ్, లావాదేవీలను పరిశీలించి ఫిర్యాదు అందజేశారు దీనిపై పరవాడ సిఐ ఆర్ మల్లికార్జున రావు కేసు నమోదు చేశారు.

తేదీ 30.08.2025 మధ్యాహ్నం పరవాడ సబ్‌స్టేషన్ జంక్షన్ వద్ద తనిఖీల సమయంలో నిందితులు శివసింగ్ (22) మరియు ప్రదీప్ సింగ్ చౌహాన్ (30), ఇద్దరూ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారు వీరిని అరెస్టు చేశారు.

వారి వద్ద నుండి చోరీ సొత్తు రూ.8,800 నగదు, Hero క్రష్ స్కూటీ, నేరానికి ఉపయోగించిన పరికరాలు స్వాధీనం చేసుకున్నారు.

నిందితులను అనకాపల్లి మేట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచగా, రిమాండ్ మంజూరు కావడంతో అనకాపల్లి సబ్ జైలుకు తరలించారు. నిందితులను పట్టుకొని కేసును ఛేదించిన పరవాడ పోలీసులను ఎస్పీ తుహిన్ సిన్హా అభినందించారు.



## చిరుతపల్లి బాలిక హాస్టల్లో వైద్య శిబిరం

**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 30 :**

వెంకటాపురం మండలంలోని చిరుతపల్లి గిరిజన బాలికల వసతి గృహంలో నూగురు సబ్ సెంటర్ డాక్టర్ ఆశిష్. ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు.ఈ శిబిరంలో విద్యార్థులకు జ్వర పరీక్షలు నిర్వహించి దగ్గు జలుబు ఉన్నవారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా కాలానుగుణ వ్యాధుల పట్ల విద్యార్థులంతా అప్రమత్తంగా ఉండాలని, ఉతికిన ఎండిన తర్వాత దుస్తులు ధరించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు సబ్బుతో చేతులు కడుక్కొని ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో. HEO. కోటిరెడ్డి ఏఎన్ఎం సరస్వతి, హాస్టల్ వార్డెన్ ఉష, ఉపాధ్యాయులు సుజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టేకు కలప పట్టివేత



**జయభేరి, వెంకటాపురం, ఆగస్టు 30 :**

ములుగు జిల్లా వెంకటాపురం ఫారెస్ట్ డివిజన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను అటవీ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి నమ్మదగిన సమాచారం మేరకు రామచంద్ర పురం గ్రామం వద్ద ఐచర్ వ్యాన్‌ను అటవీ సిబ్బంది ఆపి తనిఖీ చేశారు. వాహనంలో 20 టేకు దిమ్మలు దొరికాయి. వాటి విలువ సుమారు రూ. 8 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న టేకు దిమ్మలు, వాహనాన్ని వెంకటాపురం ఫారెస్ట్ కార్యాలయానికి తరలిం చారు. ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ ధ్వాలియా తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి, తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఈ దాడిలో రామచంద్రపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వంటకాల శ్రీనివాసరావు, వెంకటాపురం ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ దేవా, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్ దాస్, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజలు



**జయభేరి, గుండ్లపల్లి :**

గుండ్లపల్లి మండల (డిండి) పట్టణం కేంద్రంలో NSUI మాజీ రాష్ట కార్యదర్శి పున్న దినేష్ ఆహ్వానం మేరకు గణనాథుని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన BRS దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ నాయక్ అనంతరం కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ డిండి పట్టణ అద్యక్షులు గిరమోని శ్రీను, పున్న లింగమయ్య ,BRS యూత్ అద్యక్షులు రషీద్ పీర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి హాథిరా మఠం సందర్శించిన బాబు రామ్ నాయక్

**జయభేరి, దేవరకొండ :**



హాతిరం మహారాజ్ మఠం కూల్చివేత నీ ఆపాలి ఆయన పేర్కొన్నారు. ఆయన తిరుపతి లోని హాతిరం మహారాజ్ మఠాన్ని సందర్శించి గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాబు రామ్ నాయక్ కేతావత్ మాట్లాడుతూ - ఇటీవల మఠంపై జరిగిన కూల్చివేత చర్యలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ మఠం చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగినది. ఇలాంటి పవిత్ర స్థలాలను కూల్చివేయడం అనేది మతభావాలను దెబ్బ తీసే చర్య. ఇకపై ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. మఠంపై మరోసారి కూల్చివేతకు పాల్పడే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాను అన్నారు. అలాగే ఆయన మరింతగా స్పష్టం చేస్తూ మతసంస్థలు, మఠాలు, ఆలయాలు సమాజానికి ఆధ్యాత్మిక బలం. వాటిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత. మఠాన్ని కూల్చివేయడం వంటి నిర్ణయాలు సమాజంలో ఆందోళన, అసంతృప్తి కలిగిస్తాయి. ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై సమగ్ర నివేదిక ఇచ్చి, మత పరిరక్షణకు హామీ ఇవ్వాలి అన్నారు. చివరిగా బాబు రామ్ నాయక్ కేతావత్ పిలుపునిస్తూ భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. సమాజం మొత్తానికి మత సామరస్యాన్ని కాపాడే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి అన్నారు.

## గంజాయి రవాణాదారులను పట్టుకున్న పోలీసులు

- 30 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాలు సీజ్

**జయభేరి, వాజేడు, ఆగస్టు 30 :**



వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం పోలీసులు అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వారిని పట్టుకున్నారు. ఈ విషయం ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఉదయం 7:30 గంటల సమయంలో వాజేడు ఎస్ఐ సిబ్బందితో కలిసి మండపాక వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా నాలుగు మోటార్ సైకిళ్లపై ఏడుగురు వ్యక్తులు వస్తున్నారని సమాచారం ఆధారంగా గుర్తించారు. వారిని ఆపడానికి ప్రయత్నించగా, ముందున్న బైక్ పై ఉన్న ఇద్దరు తోగరి విష్ణువర్ధన్, జెనజర్ల రేవంత్ లు పట్టుబడ్డారు. వెనుక వస్తున్న మిగతా ముగ్గురు వ్యక్తులు భయపడి తమ బ్యాగులు అక్కడే వదిలి మోటార్ సైకిళ్ల పై పారిపోయారు. ఈ సందర్భంగా జరిపిన తనిఖీలలో మొత్తం 29.829 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని అంచనా విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందన్నారు. అరెస్టైన వారిని విచారించగా ఒడిశా రాష్ట్రం నుండి గంజాయి కొనుగోలు చేసి గోదావరిఖని ప్రాంతంలో ఎక్కువ ధరలకు విక్రయిస్తారని ఒప్పుకున్నారు. ఈ వ్యవహారంలో పారిపోయిన నిందితులు మేకల మహేందర్, కొల్లి అజయ్, జంజిర్ల రోహిత్, జంజిర్ల బాలాజీ, ఋత్విక్‌లుగా పోలీసులు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఏఎస్పీ తెలిపారు. అదేవిధంగా పారిపోయిన నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఈ ఆపరేషన్‌లో చురుకైన చర్యలు తీసుకున్న వాజేడు ఎస్ఐ, సిబ్బందిని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అభినందించారు.

## సాంప్రదాయ సంస్కృతి, భజన, సత్సంగం హారతి కార్యక్రమాలు చేపట్టండి

**జయభేరి, పరవాడ:**



సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతీ వినాయక చవితి మండపాలు దగ్గర పరవాడ ఖండం మరియు నగరం మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి మాట్లాడుతూ లంకెలపాలెం లో అన్ని వినాయక చవితి మండపాలు దగ్గర దేవుని పాటలు, సాంప్రదాయం సంస్కృతి, భజన, సత్సంగం సామూహిక హారతి కార్యక్రమాలు చేయాలని చెప్పడం జరిగింది. గ్యాంగ్ స్టార్ యూత్ ప్రతిష్టించిన శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయకుని కమిటీ సభ్యులు కలిసి ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ కమిటీ జెండాలు, కండువాలు, ఇవ్వడం జరిగింది. ప్రతీ వినాయక మండపాలు కమిటీ సభ్యులు కట్టాలి అని చెప్పడం జరిగింది. గణేష్ ఉత్సవాలు ఊరేగింపులో సాంప్రదాయం ,సంస్కృతి, కోలాటం భజన కార్యక్రమాలతో చేయాలని చెప్పడం జరిగింది. డి జే వంటి సౌండ్ లో ఊరేగింపులు చెయ్యకూడదని డి జే సౌండ్ వలన కొందరు అనారోగ్యం కారణం కావచ్చు అందువలన సమాజం లో అందరూ బాగుండాలి అని కోరుకుందాం అని ప్రతీ దేవాలయం కమిటీ సభ్యులు, పెద్దలు, కుల పెద్దలు కలిసి వారానికి ఒకసారి సత్సంగం, భజన, నెలలో ఒక సారి గ్రామ జట్టు సమావేశం ఏర్పాటు చేయాలని ఈసమావేశంలో దేవాలయాలు పరిరక్షణ, గ్రామంలో అభివృద్ధి, ప్రజలు ఆరోగ్యం వైద్యం గురించి, అనారోగ్యం ఉన్న వాళ్ళు కలవడం, దేవాలయానికి అందరూ వచ్చే విధంగా ఆలోచనలు, సభ్యులు కలిసి మాట్లాడం చేయాలని చెప్పడం జరిగింది. ఈకార్యక్రమంలో వినాయక మండపం కమిటీ సభ్యులు కరణం అరుణ్ కుమార్, కింతాడ మనోహర్, వై దుర్గాప్రసాద్, తేజా, గ్రాము ధార్మిక జట్టు సభ్యులు మరియు మండల సభ్యులు పెదపాటి రామచంద్రరావు, ఎక్కువగా మాతృమూర్తులు తదితరులు పాల్గొన్నారు.




## గోల్డ్ మెడల్ సాధించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి

**జయభేరి, పరవాడ:**

కెనడా లో ఈ నెల 17 నుండి 24 వ తారీకువరకు జరిగిన వరల్డ్ ఆర్చరీ యూత్ ఛాంపియన్ షిప్ లో టీం గోల్డ్ మెడల్ సాధించిన సంస్కృతి గ్లోబల్ స్కూల్ పూర్వ విద్యార్థి టీ. గణేష్ మణిరత్నంను తనతో పాటు తర్ఫీదు పొందిన తోటి అర్చర్స్ సమక్షంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీ ఈ ఓ కె. నిశాంత్, కోఆర్డినేటర్ పి.రామ లక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తోటి క్రీడాకారులను ఉద్దేసించి మాట్లాడుతూ లక్ష్యం పెట్టుకొని కృషి చేస్తే ఖచ్చితంగా విజయం సాధించగలరు అని ఓటమికినిరుత్సాహ పడకూడదు అని తెలిపాడు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 30:**

తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామానికి చెందిన బెజ్జనమైన కిష్టయ్య అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబానికి మాజీ సర్పంచ్ పోగుల ఆంజనేయులు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జనమైన నరసింహులు, ఆంజనేయులు, తూము ముత్యాలు, రాజు పాల్గొన్నారు.

## భగవాన్ బలరాం జయంతి వేడుకలు



**జయభేరి, తుర్కపల్లి, ఆగస్టు 30:**

తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలో భారతీయ కిసాన్ సాంగ్ గ్రామ శాఖ అధ్యక్షుడు గొప్ప రాంరెడ్డి ఆధ్వర్యంలో భగవాన్ బలరాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు..ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పన్యాల వెంకటరెడ్డి మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం రైతుల సమస్యలపై పోరాడిన వ్యక్తి రైతులు అందరూ ఆయన స్ఫూర్తితో ముందుకెళ్లాలని అన్నారు. గ్రామంలో ఇనుప స్తంభాలు ఏవైనా ఉంటే వాటిని వెంటనే తొలగించి సిమెంట్ స్తంభాలు వేయాలని, లూజ్ వైర్లు ఉంటే వెంటనే వాటిని సరిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాధినేని రవీందర్ ,జిల్లా కోశాధికారి వంగేటి అంజిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ధ్యాన బోయిన వెంకటేష్, పాపిరెడ్డి ,రైతులు బాలయ్య ఎరుకల స్వామి గౌడ్ రమేష్ నరసింహులు, నాగరాజు యాదవ్, సత్తయ్య, బాలయ్య, బాల నరసయ్య, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

## కేసాపురం విఘ్నేశ్వర స్వామి మండపంలో అన్నదాన కార్యక్రమం



**జయభేరి, చర్ల, ఆగస్టు 30 :**

చర్ల మండలం కేసాపురం గ్రామంలో శనివారం విఘ్నేశ్వర స్వామి మండపంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారి ఆలయంలో ప్రతిష్ఠించిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరసిద్ధి వినాయక మహోత్సవ సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి దాతలు చర్ల మండలం, గొంపల్లి వాస్తవ్యులు శ్రీ శ్రీ చల్లాకొటి వాసు దేవా కుమార్ మరియు వారి సతీమణి సంధ్య రాణి ,వారి.కుమారుడు కుమార్తె ,సత్య దేవ్,వేద ,మరియు వారి కుటుంబ సభ్యులు స్వయంగా భక్తులకి భోజనం వడ్డించారు . ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దలు పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు ఈ అన్నదాన కార్యక్రమానికి ఇచ్చినటువంటి గో0పల్లి వాస్తవ్యులకు కుటుంబ సభ్యులకు కేసాపురం ఆలయ కమిటీ వారు, గ్రామస్తులు అభినందనలు తెలియ జేసుకున్నారు.

## బైకు దొంగల అరెస్టు

**జయభేరి, జగద్గిరిగుట్ట:**

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ లో బాలానగర్ ఏసిపి నరేష్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. బాలానగర్ జోన్ లోని, పలు పోలీస్ స్టేషన్ ల పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు నిందుతుల ముఠాను జగద్గిరిగుట్ట పోలీసులు అరెస్టు చేసారు. వారి నుండి 42లక్షల విలువ గల 22 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు ఏసిపి వెల్లడించారు.



# ఉత్తరాఫ్రికాలో SSMB29

మహేశ్‌బాబు హీరోగా ఎస్.ఎస్.రాజమౌళి తెరకెక్కిస్తున్న 'SSMB 29'(వర్కింగ్ టైటిల్) సినిమాకు సంబంధించిన ఏ వార్త బయటకొచ్చినా.. అది క్షణాల్లో వైరల్ అయిపోతున్నది. ఈ సినిమాకున్న క్రేజ్ అలాంటిది. అధికారికంగా ప్రకటించకపోయినా.. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కెన్యాలో జరుగుతున్నదనే వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది.
దానికి బలాన్నిస్తూ ఈ సినిమా కథానాయిక ప్రియాంక చోప్రా కొన్ని నేచర్ ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేశారు. దీంతో మరోసారి 'SSMB 29' ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. ఈ ఫొటోలు చూసిన వారంతా ఆ ప్రాంతాలను గుర్తు పడుతూ 'మీరు కెన్యాలో ఉన్నారా?' అనీ, 'ఇది ఉత్తర ఆఫ్రికాలో తీసిన ఫొటోస్' అని రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. దీనికితోడు ఈ ఫొటోలపై మహేశ్ సతీమణి నమ్రతా శిరోద్కర్ కూడా రియాక్టయ్యారు.
ఈ ఫొటోలకు లవ్ సింబల్ ఎమోజీలను జత చేసి కామెంట్ చేశారు. దాంతో మహేశ్‌బాబు అభిమానుల్లో ఈ ఫొటోలు చర్చనీయాంశమయ్యాయి. ప్రస్తుతం కెన్యాలో జరుగుతున్నది చాలా భారీ షెడ్యూల్ అనీ, సినిమాకు చెందిన కీలక సన్నివేశాలను ఈ షెడ్యూల్‌లోనే చిత్రీకరిస్తారని సమాచారం. ఇక 'SSMB 29'కు సంబంధించిన తొలి అప్‌డేట్ నవంబర్‌లో ఉంటుందని దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఇప్పటికే ప్రకటించారు. హాలీవుడ్ డైరెక్టర్ జేమ్స్ కామెరూన్ చేతులమీదుగా ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేయించాలనే ప్రయత్నంలో రాజమౌళి ఉన్నారని తెలిసింది. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# దేశంలోనే తొలి లేడీ సూపర్ హీరో




అగ్ర కథానాయకుడు దుల్కర్ సల్మాన్‌కి చెందిన వేఫేరర్ ఫిలింస్ సంస్థ నిర్మించిన తాజా చిత్రం 'కొత్త లోక 1: చంద్ర'. ఇటీవల విడుదలైన ఈ సినిమాకు ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తున్నదని మేకర్స్ చెబుతున్నారు. మలయాళ సినీచరిత్రలో ముందెన్నడూ చూడని భారీ స్థాయిలో ఈ సినిమా నిర్మించామని, భారతదేశంలో వచ్చిన తొలి లేడీ సూపర్ హీరో చిత్రమిదని, అత్యున్నత సాంకేతిక పరిపూర్ణతతో ఒక నిర్మాతగా దుల్కర్ సల్మాన్ అసాధారణమైన అడుగు వేశారని, మలయాళ సినిమా స్థాయిని పెంచిన సినిమా 'కొత్త లోక' అని చిత్ర బృందం పేర్కొన్నది.
కల్యాణి ప్రియదర్శన్ ముఖ్య పాత్ర పోషించిన ఈ చిత్రానికి డొమినిక్ అరుణ్ దర్శకత్వం వహించారు. ప్రతిష్టాత్మక సితార ఎంటైర్టైన్మెంట్స్ సంస్థ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదలైన ఈ సినిమా భారీ వసూళ్లను సాధిస్తున్నదని, ఘన విజయం దిశగా దూసుకుపోతున్నదని సితార సంస్థ వారు శనివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. నస్లెన్, శాండీ, చందు సలీం కుమార్, అరుణ్ కురియన్, విజయ రాఘవన్, శరత్ సభ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: నిమిష్ రవి, సంగీతం: జేక్స్ బెజోయ్.



# హాలీవుడ్ నటిలా మారిపోయిన రకుల్..

బ్యూటీ రకుల్ ప్రీత్ సింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అందం, అభినయం ఈ ముద్దుగుమ్మ సొంతం. ఇక ఈ నటి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో తెలుగు వెండితెరపైకి అడుగు పెట్టి తన నటన, అందంతో ఎంతో మంది మదిని దోచుకుంది. ఈ మూవీతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఇక ఈ సినిమా తర్వాత ఈ బ్యూటీకి వరసగా అవకాశాలు తలుపు తట్టాయి. ముఖ్యంగా టాలీవుడ్ స్టార్ హీరోల సరసన ఛాన్స్ కొట్టేసింది. వరసగా మూవీస్ చేస్తూ, బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకుంటూ, టాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా తన సత్తా చాటింది. కానీ తర్వాత ఈ బ్యూటీకి వరసగా అవకాశాలు తగ్గడంతో టాలీవుడ్‌కు గుడ్ బై చెప్పి బాలీవుడ్ వైపు వెళ్లిపోయింది. ఇక అక్కడ సినిమాలు చేస్తూ ప్రముఖ నటుడు, నిర్మాత జాకీ భగ్నానిని ప్రేమించి , పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే, ఇక పెళ్లి తర్వాత ఈ బ్యూటీ సినిమాలు ఎక్కువగా చేయకపోయినప్పటికీ, బిజినెస్‌లు చూసుకుంటూ చాలా బిజీ అయిపోయింది. అలాగే సినిమాల పరంగా తన అభిమానులకు దూరం ఉన్న ఈ చిన్నది, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పుడూ తన అభిమానులను ఆకట్టుకుంటూనే ఉంటుంది. తాజాగా ఈ బ్యూటీ ఓ కవర్ పేజీ కోసం దిగిన ఫొటోస్ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. అందులో ఈ అమ్మడును చూస్తే మతి పోవాల్సిందే. అంత అందంగా, దేవకన్యలా, మహారాణిలా కనిపిస్తూ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటో నెటిజన్స్‌ను తెగ ఆకట్టుకుంటున్నాయి. ఇక వీటిని చూసిన కొందరు అచ్చం హాలీవుడ్ నటిలా ఉన్నావంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ ఫొటోల్లో రకుల్, బ్లాక్ సారీ, డిఫరెంట్ డిజైన్స్ తో తయారు చేసిన డ్రెసెస్, క్రౌన్ ధరించి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. దీంతో ఈ ఫొటోస్ నెట్టింట తెగ ట్రెండ్ అవుతున్నాయి.



# ముగ్గురు పిల్లలను కనాలని ఉంది..

ప్రస్తుతం పెళ్లి చేసుకున్నవారు ఒకరు లేదా ఇద్దరు పిల్లలు చాలు అంటున్నారు. అంతకు మించి అసలు ఆలోచనే లేదంటున్నారు. అయితే బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ మాత్రం చాలా డిఫరెంట్ గా ఆలోచిస్తోంది. శ్రీదేవి నట వారసురాలిగా ధడక్ సినిమాతో హీరోయిన్ గా బాలీవుడ్ ఇండస్ట్రీకి పరిచయమైంది జాన్వీ. ఆ తర్వాత పలు సూపర్ హిట్ సినిమాలతో తల్లికి తగ్గ తనయ అనిపించుకుంటోంది. ఎన్టీఆర్ తో కలిసి దేవర సినిమాతో తెలుగు ఆడియెన్స్ ను కూడా పలకరించిందీ అందాల తార. ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తో కలిసి పెద్ది అనే సినిమాలో నటిస్తోంది. కాగా జాన్వీ నటించిన లేటెస్ట్ సినిమా పరం సుంది. సిద్దార్థ్ మల్హోత్రా ఇందులో హీరోగా నటించాడు. తన పెళ్లి, పిల్లల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు నెట్టింట వైరలవుతున్నాయి. 'నేను పెళ్లి చేసుకున్న తరువాత ముగ్గురు పిల్లలను కనాలని అనుకుంటున్నాను. ఎందుకంటే మూడు నా లక్కీ నంబర్. అంతేకాదు నా పిల్లల్లో ఇద్దరు గొడవ పడుతున్నప్పుడు, మూడో బిడ్డ వాళ్లలో ఒకరికి సపోర్ట్ గా ఉంటారు. సందర్భాలను బట్టి ఈ సపోర్ట్ మారుతూ ఉంటుంది. ఈ విధంగా నా బిడ్డలందరికీ ఒక తోడు, సపోర్టు దొరుకుతుంది' అని జాన్వీ చెప్పుకొచ్చింది. కాగా జాన్వీ కపూర్ తన పెళ్లి, భర్త గురించి మాట్లాడటం ఇదే మొదటిసారి కాదు. గతంలో పలుమార్లు ఇదే తరహా కామెంట్స్ చేసి వార్తల్లో నిలిచింది. జాన్వీ కపూర్ తన భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి తిరుపతిలో సెటిల్ అవ్వాలని కోరుకుంటున్నట్లు ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది.

# బర్త్ డే నాడు ఫ్యాన్స్‌ని నిరాశపరిచిన నాగార్జున.. 'కింగ్ 100' సినిమా మరింత ఆలస్యం




అక్కినేని నాగార్జున ఆగస్ట్ 30న 60వ వసంతంలోకి అడుగుపెట్టారు. సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 'బర్త్ డే' హ్యాష్‌ట్యాగ్‌ను ట్రెండ్ చేస్తూ నాగ్‌కు మద్దతు తెలిపారు. ఇక ఆయన కుమారులు నాగచైతన్య, అఖిల్ కూడా తమ తండ్రికి స్పెషల్ విషెస్ అందజేశారు. ఈ సందర్భంగా, నాగార్జున అభిమానులకు మరింత ఉత్సాహాన్ని కలిగించే విధంగా 'రగడ' సినిమా థియేటర్లలో రీరిలీజ్ చేశారు. ఇక నాగార్జునకి ఈ పుట్టిన రోజు మరింత ప్రత్యేకంగా నిలిచింది. బయటకు వచ్చి అభిమానులని పలకరించి వారికి అభివాదం చేశారు. ప్రస్తుతం అక్కినేని నాగార్జున తన 100వ సినిమా "కింగ్ 100" కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా కోసం దర్శకుడిగా తమిళ డైరెక్టర్ రా. కార్తీక్ ఎంపిక అయ్యారు. కథకి మంత్రముగ్ధుడైన నాగార్జున, ఈ ప్రాజెక్ట్‌ను స్వయంగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో నిర్మించేందుకు సిద్ధమయ్యారు. నాగార్జున ఇటీవల ఒక టాక్ షోలో ఈ సినిమాను గురించి మాట్లాడారు. "పవర్ ఫుల్ యాక్షన్, ఫ్యామిలీ డ్రామా అంశాలతో అద్భుతమైన సినిమా అవుతుంది. త్వరలోనే 'కింగ్ 100' సినిమాను ప్రారంభిస్తాం" అని చెప్పారు. అయితే, ఈ సినిమాకి సంబంధించిన అప్‌డేట్ నాగ్ పుట్టినరోజు సందర్భంగా వస్తుందని అనుకున్నారు. కాని అలాంటిది ఏమి జరగలేదు. సాధారణంగా సినీ హీరోలు తమ పుట్టినరోజు సందర్భంగా కొత్త సినిమాల గురించి అప్డేట్‌లు ఇస్తుంటారు, కానీ ఈసారి నాగార్జున తన అభిమానులని నిరాశపరిచాడు. "కింగ్ 100" సినిమా అనౌన్స్‌మెంట్ ఆలస్యం కావడంతో ఫ్యాన్స్ లో కొంత నిరాశ అలుముకుంది. కానీ ఇండస్ట్రీలో వినిపిస్తున్న వార్తల ప్రకారం, నాగార్జున సినిమా ప్రకటనకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారనే టాక్ వినిపిస్తుంది. నాగార్జున తన 100వ సినిమాను సరికొత్త శైలిలో, మరింత గ్రాండ్‌గా రూపొందించనున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రంతో నాగ్ పెద్ద హిట్ కొట్టాలని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314**. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com